

రైస్‌మిల్లులోని సీఎంఆర్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

## సీఎంఆర్‌ను వేగవంతం చేయాలి

**వికారాబాద్ అద నపు కలెక్టర్ లింగ్యానాయక్**

పరిగి, ఏప్రిల్ 13 : సీఎంఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. శనివారం మండలంలోని న్యూఇండియన్ రైస్‌మిల్, శివశక్తి రైస్‌మిల్‌లను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖరీఫ్ 2023-24 రోజువారీ సీఎంఆర్ మిల్లింగ్ సామర్థ్యంపై మిల్లర్లను అడిగి తెలు సుకున్నారు. మిల్లర్ల వద్ద ధాన్యం నిల్వలను పరిశీలించారు. రోజువారి సీఎంఆర్ మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేసి బియ్యాన్ని ఎఫ్‌సీఐకి సకాలంలో చేరవేయాలన్నారు. ఆయన వెంట పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు ఉన్నారు.

## బీజేపీని ఇంటికి సాగనంపాలి



సమావేశంలో మాట్లాడుతున్న జహంగీర్

ఇబ్రహీంపట్నం రూరల్, ఏప్రిల్ 13 : మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజల్లో చిచ్చుపెడుతున్న బీజేపీని ఇంటికి సాగనంపాలని సీపీఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి జహంగీర్ అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నంలోని పాషా, నరహరి స్మారక కేంద్రంలో నిర్వహించిన సీపీఎం ఇబ్రహీంపట్నం విస్తృత స్థాయి కార్యకర్తలు, నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలేదని.. ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. అలాగే బీజేపీ మతాలు, కులాల మధ్య చిచ్చుపెడుతూ.. జైశ్రీరాం అనే నినాదంలో ముందుకుపోతున్నదన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న బీజేపీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు జంగారెడ్డి, జిల్లా కార్యదర్శి భాస్కర్, కార్యవర్గ సభ్యులు యాదయ్య, సామెల్, మండల కార్యదర్శి జంగయ్య, ఉన్నీసాబేగం, ఎల్లేశ్, శంకర్, బుగ్గరాములు, జగన్ పాల్గొన్నారు.



అగ్నిమాపక వారోత్సవాల గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ రాజు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జగన్

## అప్రమత్తతతో అగ్నిప్రమాదాలు నివారణ

**అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ రాజు**

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 13 : వేసవిలో అనుకోకుండా సంభవించే అగ్నిప్రమాదాలను అప్రమత్తతతో నివారించొచ్చని అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ రాజు అన్నారు. షాద్‌నగర్ అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ వారోత్సవాల గోడ పత్రికను శనివారం ఆయన స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జగన్, సిబ్బందితో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. అగ్నిప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. నివాసాల సమీపంలో ఎలాంటి చెత్తను కాల్చొద్దన్నారు. చిన్న, చిన్న పొరపాట్లు, తప్పిదాలతో అగ్నిప్రమాదాలు జరుగుతాయని, అనుకోకుండా సంభవించే అగ్నిప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏటా అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే షాద్‌నగర్ ఫైర్‌స్టేషన్ 08548-250101కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది రామకృష్ణ, శామప్ప, గోపీనాథ్, ఉదయ్‌కుమార్, దామోదర్, సమీర్, మన్యం, శ్రావణ్‌కుమార్, శ్రీశైలం, శ్రీశైలం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### దేశవ్యాప్తంగా

## దోచేశారు

- 18 అకౌంట్లతో రూ. 26 కోట్లు వసూలు
- పెట్టుబడి పేరుతో ఆన్‌లైన్ మోసాలు..నిందితుల అరెస్టు

సిటీబ్యూరో, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): పెట్టుబడి పేరుతో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతూ దేశవ్యాప్తంగా దోచేసిన ఇద్దరు ఘరానా నేరగాళ్లను నగర సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ క్రైమ్ డీసీపీ కవిత కథనం ప్రకారం...కేరళకు చెందిన నౌషద్, అహ్మద్ కబీర్ ఆన్‌లైన్ ద్వారా ఆర్థిక మోసాలకు పాల్పడే నిందితులకు బ్యాంక్ అకౌంట్లు అందిస్తుంటారు. ఈ క్రమంలో నిందితులిద్దరూ 2021లో కేరళకు చెందిన ఇస్సాక్, తాహెర్ అలీని సంప్రదించి, ఆన్‌లైన్ మోసాలకు సహకరించాలని కోరారు. అంతేకాకుండా నకిలీ కేవైసీలతో నకిలీ అకౌంట్లను తెరవడంతో పాటు కొన్ని బ్యాంక్ ఖాతాలను అద్దెకు తీసుకుని మోసపూరితంగా నగదు బదిలీ చేసేందుకు వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో 18 ఖాతాల ద్వారా అమాయకుల నుంచి పెట్టుబడి పేరుతో దేశవ్యాప్తంగా దాదాపు రూ. 26 కోట్లు వసూలు చేశారు. అనంతరం దుబాయ్ వెళ్లి అక్కడి నుంచి ఇండియన్ కరెన్సీని క్రిప్టో ఎక్స్‌ఛేంజ్ ద్వారా యూఎస్‌డీటీలోకి మార్చుకుని పోలీసులకు చిక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ క్రమంలోనే నగరానికి చెందిన ఓ వ్యక్తికి అంతర్జాతీయ కంపెనీల్లో పెట్టుబడులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి బాధితుడి నుంచి రూ. 9.44 లక్షలు వసూలు చేశారు. ఎంతకీ డబ్బులు వాపస్ ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు.. నగర సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన సైబర్‌క్రైమ్ పోలీసులు.. ఈనెల 11న నౌషద్, అహ్మద్ కబీర్‌లను అరెస్టు చేసి వారి నుంచి 5 సెల్‌ఫోన్లు, 8 డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

### దానం.. ఎమ్మెల్యే పదవికి

## రాజీనామా చెయ్

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 13: సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దానం నాగేందర్‌కు తార్నాకలో నిరసన సెగ తాకింది. బీఆర్‌ఎస్ తరపున ఎన్నికైన దానం..వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర గ్రేటర్ అధ్యక్షుడు హరి ఆధ్వర్యంలో ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. తార్నాక డివిజన్ లాలాపేటలోని హఫీజ్ గార్డెన్‌లో కాంగ్రెస్ బూత్ లెవల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఆ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలుపుతుండటంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



వేదికపై డ్యాన్స్ చేస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య





వేదికపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు నమస్కరిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి, జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి.. పక్కన కార్తిక్‌రెడ్డి

# దారులన్నీ చేవెళ్లవైపే..

రంగారెడ్డి, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ) : చేవెళ్లలో శనివారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు జనం పోటెత్తారు. లక్షలాదిగా తరలివచ్చిన ప్రజానీకాన్ని చూసి గులాబీ అడ్డ పులకించిపోయింది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు అశేష ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది. కేసీఆర్ ప్రసంగిస్తున్నంత సేపు ఈలలు, చప్పట్లతో ప్రజల నుంచి మద్దతు వెల్లువెత్తింది. దారులన్నీ చేవెళ్లవైపే..అన్నట్లుగా దారులన్నీ జనంతో కళకళలాడుతూ గులాబీమయమయ్యాయి. సభా వేదికపై కళాకారుల ఆటపాటలు ఉర్రూతలూగించాయి. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన తొలి సభ బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది.

**ప్రతిపక్ష పార్టీల్లో వణుకు పుట్టించిన సభ..**

ప్రజా ఆశీర్వాద సభతో చేవెళ్ల గడ్డ పులకించగా..ఈ సభ ప్రతిపక్ష పార్టీల్లో వణుకు పుట్టించింది. బీఆర్‌ఎస్ సభతో పోల్చుకుంటే ఈనెల 6న కాంగ్రెస్ రాహుల్ గాంధీతో నిర్వహించిన సభ వెలవెలబోయిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది. కాంగ్రెస్ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి జనాన్ని తరలించగా..కేవలం చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ప్రజలతో నే ప్రజా ఆశీర్వాద సభ కిక్కిరిసింది. ప్రతిపక్ష నేతల్లో గుబులు పుట్టించేలా.. కేసీఆర్ మాటలకు చప్పట్లు, ఈలలు, కేరింతలు ప్రతిధ్వనించాయి. బీఆర్‌ఎస్ హయాంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించినప్పుడు, విపక్షాల తీరును ఎత్తి చూపినప్పుడు జనమంతా జనం ఈలలు, చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. జై తెలంగాణ..జై కేసీఆర్..జై జ్ఞానేశ్వర్ అన్న నినాదాలతో చేవెళ్ల పట్టణం దద్దరిల్లింది.



చేవెళ్లలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు భారీగా తరలివస్తున్న మహిళలు, బీఆర్‌ఎస్ శ్రేణులు













ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన అశేష జనం

### పుష్కలంగా తాగునీరు..

# ప్రజలు ఆందోళన చెందొద్దు

- రాష్ట్రంలో 23,975 గ్రామాలకు 37,002 ఓహెచ్ఎస్ఆర్ ద్వారా మంచి నీటి సదుపాయం
- రూ.100 కోట్లతో చేతిపంపులు, పైపులైన్లకు మరమ్మతులు
- వికారాబాద్ జిల్లాలో రూ.3.54 కోట్లతో 1044 పంపు సెట్లు, 495 చేతి పంపులకు మరమ్మతులు
- మీడియా సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా



తాండూరు : సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా..చిత్రంలో పక్కన కలెక్టర్ నారాయణరెడ్డి

తాండూరు/కొడంగల్, ఏప్రిల్ 13 : రాష్ట్రంలోని 23,975 గ్రామాలకు 37,002 ఓహెచ్ఎస్ఆర్ ద్వారా ఇంటింటికీ మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నట్లు.. ఈ వేసవిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తకుండా రూ.100 కోట్ల నిధులు కేటాయించినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా తెలిపారు. శనివారం తాండూరు కాగ్నానది, పంప్ హౌస్‌ను సంబంధిత శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించి.. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత వేసవిలో తాగునీటి సరఫరా అత్యంత కీలకమన్నారు. నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయని తాగునీటికి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం కూడా నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిని సారించిందన్నారు. నీటి ఎద్దడి తలెత్తకుండా యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో రూ.100 కోట్ల నిధులతో 19,605 చేతిపంపులు, 14,708 సింగిల్‌ఫేస్, 5 హెచ్‌పీ పంపుసె ట్లు, 605 మంచినీటి బావులు, 662 కిలోమీటర్ల ఇంట్రా పైపులైన్లకు మరమ్మతులతో పాటు పలు పనులు పూర్తైనట్లు తెలిపారు. వికారాబాద్ జిల్లాలో రూ. 3.54 కోట్లతో 1,044 పంపుసెట్లు, 495 చేతి పంపులకు మరమ్మతులు చేయించామన్నారు. తాండూరు కాగ్నానది నుంచి కొడంగల్, యాలాల మండలాల పరిధిలోని గ్రామాలకు మంచి నీటి కల్పనకు కాగ్నానది ఇంటెక్‌వెల్‌ను 2.5 ఎంఎల్డీ పెంపునకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో నీటి స్వచ్ఛతను తెలుసుకునేందుకు ప్రతి గ్రామానికీ క్లోరోస్కోప్ కిట్లను పంపిణీ చేశామని.. అవసరమున్న గ్రామాల్లో పశువులకు నీటి తొట్టెలను కూడా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఎక్కడ నీటి సమస్య ఉన్నా 24 గంటల్లో పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. తాగునీటి సరఫరా అంశంపై సీఎంతో సహా చీఫ్ సెక్రటరీ కూడా ప్రతిరోజూ రివ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తాగునీటి సరఫరాలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా విద్యుత్ సబ్‌స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు.. సంప్‌హౌస్‌ల్లో లోవోల్టేజీ సమస్య తలెత్తకుండా 72 ప్రాంతాల్లో వోల్టేజీ స్టెబిలైజర్లను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

అనంతరం వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం చురుకుగా పని చేస్తున్నదని.. ప్రతిరోజూ తాగునీటిపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, మిషన్ భగీరథ ఇంజినీర్ చీఫ్ కృపాకర్‌రెడ్డి, చీఫ్ ఇంజినీర్ చెన్నారెడ్డి, ఎస్ఈ ఆంజనేయులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు బాబు, శ్రీనివాస్, చల్మారెడ్డి, వెంకటరమణ, జడ్పీ సీఈవో సుధీర్, డీపీవో జయసుధ, డీఆర్‌డీవో శ్రీనివాస్ తదితరులున్నారు.

### నీటిశుద్ధి ప్లాంట్ సందర్శన



రాఘవాపూర్‌లోని నీటిశుద్ధి ప్లాంట్‌ను పరిశీలిస్తున్న సందీప్‌కుమార్ సుల్తానియా

పరిగి, ఏప్రిల్ 13 : మండలంలోని రాఘవాపూర్‌లో ఉన్న మిషన్ భగీరథ 135 ఎంఎల్‌డీ నీటి శుద్ధి ప్లాంట్‌ను సందీప్‌కుమార్ సుల్తానియా వికారాబాద్ కలెక్టర్, అదనపు కలెక్టర్లతో కలిసి శనివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రోజు ఎంత నీరు శుద్ధి చేయడం జరుగుతున్నది.. ఎన్ని ఆవాసాలకు తాగునీరు అందుతున్నదని ఆరా తీయగా.. పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాలకు శుద్ధి చేసిన నీరు అందుతున్నదని అధికారులు తెలిపారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా తాగునీటి సరఫరా చేపట్టాలని అధికారులకు సూచించారు.